# పల్లె పట్నున

అక్కడ మూడు రంగుల జెండాలూ, నీలం రంగు జెండాలూ, ఎర్ర జెండాలూ వానలో తడిసి, ఎండలో ఎండి చివికి పోతుంటాయి. ఇళ్లు అస్థిపంజరాల్లా ఉంటాయి. కిందటి సారి వచ్చిన వానకో, అప్పుడెప్పుడో వచ్చిన గాలివానకో కూలిపోయి ఉంటాయి. తడికలు చాటు చేసుకుని కుటుంబాలు బతుకుతుంటాయి.

ఆ ఊళ్లో జాము రాత్రప్పుడు కూడా వీపులు తెగిపోతున్నట్టు ఉబ్బసపు దగ్గో, క్షయదగ్గో, కోరింత దగ్గో వినిపిస్తుంటుంది. నడివయస్సు వాళ్లే ఆడా మగా కూడా అస్థిపంజరాల్లా కుంటుతోనో, పాకుతోనో, వణుకుతోనో కళ్లల్లో ప్రాణాలు పెట్టుకుని వీధుల్లో కనిపిస్తారు.

ఎప్పుడూ కన్నీళ్లెరగని గుడి గోపురం మీది గూళ్లల్లో పావురాలని రాత్రి చీకట్లో ఏ పామో వచ్చి పట్టుకుంటుది. లేస్తూ లేస్తూనే సూర్యుడు ఆ గోపురంలోని కలవరం వింటాడు. పోతూ పోతూ సూర్యుడు ఆ గోపురం మీది నెత్తురు మరకల్ని తుడుస్తోపోతాడు.

అక్కడ ఏ ఇంటి వాకిటనుంచో నీ మొగుడితల ముక్కలవ అనో, నీ ఇంట్లో పీనుగబడాఅనో తిట్లు వినబడతాయి. కాదూ నీ నెత్తురు కళ్ల చూస్తాననో, కుత్తుక కోసి పారేస్తాననో, ఈ కత్తి నీ గుండెల్లో దించుతాన్రా అనో ఆగ్రహావేశాలతో అరుపులు వినిపిస్తాయి.

ఊరుకు ఆనుకునే ఒకటో రెండో చెరువులుంటాయి. అవి వర్షాకాలం నిండుతాయి. ఎండాకాలం ఎండుతాయి. వాటికి దగ్గర్లో ఒక వల్లకాడు ఉంటుంది. చచ్చిపోయిన వాళ్లు అక్కడే మట్టిలో కలిసి పోతారు. ఆ పక్కనే పశువులు పచ్చి గడ్డిని గీక్కొంటాయి. తలవంచుకుని నెత్తిన చేతులుంచుకుని శవదహనం తర్వాత ఆత్మీయులు చెరువుగట్టునున్న రావి చెట్టు నీడన రాళ్ల మీద కన్నీటి చారికలతో కూచుంటారు.

బస్తా లెక్కించుకొని, బళ్లుతోలుకుని పనిమీద పట్నాలకు వెళ్లిన మనుషులు, పొద్దుతిరిగిన వేళకి ఆకలిని బళ్లమీద వేసుకుని ఎడ్లను అదిలిస్తూ ఇళ్లకు తిరిగి వస్తారు. ఎడ్లకి కుడితినీళ్లు పెట్టి నీడన కట్టి కాళ్లూ వొళ్లూ కడుక్కుని కంచం ముందు కూచుంటారు. వాళ్ల తల్లులో, పెళ్లాలో ఆకలితో మాడుతూ వచ్చిన మగాళ్లకి ఉన్నంతలో పెట్టి పక్కనే నుంచుంటారు. చుట్ట ముట్టించుకుందుకు ఆరిపోతున్న కట్టెను పొయ్యిలోంచి తీసి ఇస్తారు.

బడి పిల్లల్కోసమని ఇచ్చిన అమెరికా పాలపొడిని పంతుళ్లు సగం ధరకి పట్నంలో వర్తకులకు అమ్మేస్తారు. బడిపిల్లల ఫలహారం కోసం వచ్చిన గోధుమరవ్వనీ, నూనెను కూడా షాపువాడి ఖాతలో జమకట్టించుకుంటారు కదా!

ఎండాకాలమే అదయితే, వాకిళ్లలోనో, పాతర్లమీదనో చాపో, గావంచో పరచుకుని ఓ కునుకు తీసుకుంటారు. అదే వానాకాలమయితే ఇంతింత దోమలు కరుస్తుంటాయి. బురద కుమ్ముకుని వచ్చిన కుక్కలు పక్కల మీదికి వచ్చి పొట్టలో దూరి పడుకుంటాయి. వాటిని వానలోకి తన్ని ముసుగులో ముడుచుకు పడుకుంటారు. అదే శీతాకాలమయితే ఎడ్లముందేసిన ఎండుగడ్డి కాస్తా ఎత్తుకొచ్చి మంటలేసుకుని కాళ్లు చాపుకుని, ముఖాన్ని కప్పేట్టుగా తలపాగాచుట్టుకుని కూచుంటారు.

జబ్బో జరమో వస్తే ఊళ్లో ఎవరో పెద్దమనిషి ఒకాయన వచ్చి నోట్లోని పొగాకు ఉమ్మేసి మంత్రం వేస్తాడు. ఏ దీర్ఘకాల రోగమో దాపురిస్తే గుళ్లో దేవునికి కొబ్బరికాయ కొట్టో, అమ్మవారికి పసుపు నీళ్లు పోసో, కోడిని కోసో మొక్కుకుని భారమంతా భగవంతుని మీద పడేస్తారు. తూరుపుదిక్కు తిరిగి దండాలు పెట్టేస్తారు.

పెళ్లిళ్లు సరే అక్కడ సంతోషంగానే, శుభంగా గానే జరుగుతాయి. అట్లాంటి సమయంలో పురోహితుడు మంత్రాలతో గోలపెట్టేస్తాడు. మేళాలని తూతూలాడించేసి తువ్వాళ్లు దులుపుకుని సన్నాయిలను చంకన పెట్టేసుకుంటారు వాద్యకారులు. అమ్మాయిని సాగనంపేటప్పుడుతల్లీతండ్రులు దుఖ్ఖంతో కుంగిపోతూ ఉంటారు.

ఎక్కడన్నా ఒక పుట్టుక వచ్చిందా ఆ తండ్రి క్కూడా ఆనందం ఉండదు. మంత్రసాని ముడుపు చెల్లించటానికి ఏ పెద్దబాబు కాళ్లనో పట్టుకుని బతిమాలుకోవాలి. లేదా ఏ పొలం గట్టునో ఏ విషప్పురుగు ముట్టినందుకో విలవిల్లాడిపోతూ ఏడుస్తుంటారు. లేదా అటూ ఇటూ కాని మధ్య దారిలో ఏ బండి ఇరుసు విరిగిపోయినందుకో, అలిసిన ఎడ్లతో ఆకలికళ్లతో దిక్కుతోచక ఆకాశం వంక చూస్తూ ఉంటారు. లేదా బుగతోరి కంబారితనంతో నాగలికి నక్కెయ్యేంచటానికో ఏ కమ్మరి కొలిమిదగ్గరో పదిమంది మధ్య పడిగాపులు పడి ఉంటారు. కాన్పులో పెళ్లం చావు బతుకుల మధ్య ఉందన్నా...... పని మధ్య వదిలి వెళ్లలేరు.

చావొచ్చినా అంతే. అప్పటికప్పుడు కట్టెలు వెతుక్కోవాలి. పనుల్లోకి పారిపోతున్న వాళ్లకి వినిపించేట్టు గొంతుచించుకొని ఏడ్చి ఏడ్చి వాళ్లు కాస్తా వల్లకాడు వరకూ వచ్చేట్టు కన్నీటితో పిల్చుకోవాలి.

ఆ ఊళ్లోనూ నూతులుంటాయి. ఆ నూతుల్లో మూణ్నెల్లకీ, ఆర్నెల్లకీ కాకపోయినా ఏడాదికో రెండేళ్లకో ఆత్మహత్య చేసుకున్న ఆడకూతురు శవం తప్పనిసరిగా బైటికి

తేలుతుంది. పెద్దలు శవపంచాయితీ అని గొడవచేస్తారు. తల్లీతండ్రీ శవాన్ని దహనానికి ఇమ్మని కాళ్లావేళ్లా పడతారు. ఆ శవాన్ని ఈ రాబందుల్నించి కాపాడుకోవడమే పదివేలని ముక్కోటి దేవతలను మొక్కుకుంటారు.

ఇంక తల్లిదండ్రులతో పడని కుర్రాళ్ల సంగతి. వాళ్ల ఊరు పక్కనించే పట్నాలకు ఎలక్ట్రిసిటీ తీసుకుపోయే స్థంబాలుంటాయి. ఆ స్థంబాలెక్కి ఆ తీగల్ని పట్టేసి రక్తం కక్కుకుంటూ నేలమీద పడతారు. అంత ధైర్యమూ చాలనివాళ్లు ఏ రైలన్నా ఒక్కటేనని భగవంతుణ్ని తలంచుకుంటూ ఈ ప్రపంచం పీడ వదిలించుకుని సంతోషిస్తారు.

రేవు దగ్గరో బావి దగ్గరో పరాయి మగాడితో కోడలు మాటాడినందుకు రంకుతనం కట్టి అత్త ఆరోజు గంజిపొయ్యదు. మొగుడు మాటాడడు. కన్నవారింటికి పోవటానికి చేతిలో చిల్లిగవ్వ ఉండదు. పిడకల కుచ్చిరకాడా పెరట్లో కూచుని ఎంత ఏడ్చినా కన్నీరు తుడిచేవాళ్లుండరు. ఏమయిందని అడిగే వాళ్లూ ఉండరు.

*

*[వేగుంట మోహన్ ప్రసాద్ కు కృతజ్ఞతలతో]*
*(ప్రచురణ పొలికేక 16-01-1970)*